ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
శనివారం 15 ఫిబ్రవరి 2025



మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నుంచి ఉత్తర్వులు అందుకుంటున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

భక్త వనసంద్రం

చిన్న జాతరకు పోటెత్తుతున్న జనం

- మూడోరోజు 2లక్షల మందికిపైగా రాక
- సందడిగా మేడారం పరిసరాలు, వనదేవతల గద్దెలు
- నేడు ముగియనున్న మినీ సంబురం

వనం.. భక్త జన సంద్రంగా మారింది. చిన్న జాతరకు తరలొస్తున్న లక్షలాది భక్తులతో మేడారం పరిసరాలు, వన దేవతల గద్దెల ప్రాంగణాలు సందడి మారాయి. ఈ మినీ సంబురంలో మూడోరోజూ పూజారులు మేడారం గ్రామంలోని సమ్మక్క కన్నెపల్లి గ్రామంలోని సారలమ్మ పూజా మంది రాల్లో అంతర్గత పూజలు చేశారు. శుక్రవారం సుమారు 2 లక్షల మందికిపైగా తరలొచ్చి జంపన్నవాగులో పుణ్య స్నానాలు ఆచరించి.. గద్దెలకు చేరుకొని అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించు కున్నారు. ఇక ఈ మినీ జాతర సంరంభం శనివారం ముగియ నుండగా ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించనున్నారు. చివరి రోజు శనివారంతో పాటు, ఆదివారం భక్తులు భారీగా తరలొస్తారన్న అంచనాలు వేసిన అధికారులు ఆమేరకు ఏర్పాట్లు చేశారు.

- తాడ్వాయి, ఆంధ్రజ్యోతి


సమ్మక్క గద్దె వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

మొక్కు చెల్లించేందుకు గద్దెలకు వస్తున్న భక్తురాలు

భక్తురాలి పూనకం

వివరాలు : 7 లో..

సొసైటీలకు కలిసొచ్చిన కాలం

- డీసీసీ బ్యాంకు, పీఏసీఎస్‌ల పాలకవర్గాల గడువు పొడిగింపు
- ఆరు నెలల పాటు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు
- ఆనందంలో ప్రజాప్రతినిధులు.. సీఎంకు కృతజ్ఞతలు

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డీసీసీ బ్యాంకు, పీఏసీఎస్ నూతన పాలకవర్గాల ఏర్పాటు విషయమై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. రాష్ట్రంలోని డీసీసీ బ్యాంకులు, పీఏసీఎస్‌ల పాలకవర్గాల గడువును 6 నెలలు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నుంచి టెస్కాబ్ చైర్మన్ మార్నేనీ రవీందర్‌రావు ప్రభుత్వ ఉత్తర్వులను అందుకున్నారు. దీంతో పాలకవర్గ సభ్యుల్లో ఆనందం నెలకొంది.

మహాజన సభలోనే సభ్యుల ఆశాభావం

డీసీసీ బ్యాంకు చివరి మహాజన సభ జనవరి 20న జరిగింది. ప్రభుత్వం గడువు పొడిగిస్తే మిగిలిన లక్ష్యాలను కూడా పూర్తి చేసేందుకు అవకాశం ఉంటుందన్న భావనలను సభ్యులు వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రభుత్వం గడువు పొడిగించాలనే విజ్ఞాపనతో పాటు ఆ మేరకు సర్కారు స్పందిస్తుందన్న ఆశాభావాన్ని సైతం వ్యక్తం చేశారు. చివరకు ప్రభుత్వం కూడా గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో పాలకవర్గ సభ్యుల్లో ఆనందోత్సాహాలు వెల్లి విరిశాయి.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు : టెస్కాబ్ చైర్మన్

సహకార సంఘాలకు మరో ఆరు నెలల గడువును పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేయడంపై టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, సీతక్కతో పాటు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు, కాంగ్రెస్ ముఖ్య నేతలు, కార్యకర్తలకు రవీందర్‌రావు కృతజ్ఞతలు తెలియచేశారు.

గురుకులాల పనివేళలు మార్చాలి

ఎమ్మెల్సీ నర్సిరెడ్డి


గాంధీనగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

కొత్తగూడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : గురుకులాల్లో అసంబద్ధంగా ఉన్న పనివేళలు మార్చాలని, రాష్ట్రంలోని గురుకులాలన్నీ ఒకే మేనేజ్‌మెంట్ కిందకు తీసుకురావాలని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. గాంధీనగర్ గిరిజన సంక్షేమశాఖ గురుకుల పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిప్యూటీ వార్డెన్లను నియమించాలని డిమాండ్ చేశారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులకు గెజిటెడ్ హోదా కల్పించాలన్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేసి.. పదోన్నతులు కల్పించాలన్నారు. సీఆర్టీలకు టైమ్‌స్కేల్ చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి ఈసం నర్సింగరావు, టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల సాంబయ్య, టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు పూనెం రాంచందర్, గంగారం మండల ప్రధాన కార్యదర్శి చుంచ శ్రీనివాస్, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు మల్కం వీరాస్వామి, చుంచ సారయ్య, వాసం కిషిందర్, సాయిలు, శివకృష్ణ, పాల్గొన్నారు.

ఖమ్మం జిల్లాలో ఘోర ప్రమాదం

- గ్రానైట్ బండల లారీ బోల్తా.. ఇద్దరి దుర్మరణం
- మృతుల్లో దోర్నకల్ మండల వాసి


6


పీరన్న(ఫైల్)

బియ్యాన్ని నూకలుగా మార్చి దందా

రైస్ మిల్లులో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

- 25 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ పట్టివేత
- మిల్లు, రేషన్ షాపుపై కేసులు


మహమూద్‌పట్నంలో అధికారులు పట్టుకున్న రేషన్ బియ్యం


కేసముద్రం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మహమూద్‌పట్నంలోని వీరాంజనేయ రైస్ మిల్లులో వరంగల్ టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు చేసి, 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు డీసీఎస్‌వో ప్రేమ్‌కుమార్ తెలిపారు. డీసీఎస్‌వో తెలిపిన ప్రకారం. మిల్లులో రేషన్ బియ్యం ఉన్నట్లు సమాచారం అందడంతో శుక్రవారం తెల్లవారుజామున ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మిల్లులో పిండిమిల్లు యంత్రాలను ఏర్పాటు చేసుకొని ప్రజా పంపిణీ వ్యవస్థలోని బియ్యాన్ని రూ.12ల చొప్పున రేషన్ డీలర్ల వద్ద కొనుగోలు చేసి నూకలుగా మార్చి రూ.22ల చొప్పున విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ క్రమంలో మిల్లులో 34 బస్తాల్లో 25.750 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అధికారులు గుర్తించారు. ఇందులో పౌర సరఫరాల శాఖకు చెందిన బస్తాల్లోనే ఏడు క్వింటాళ్ల బియ్యం నేరుగా చౌకధరల దుకాణం నుంచి తరలించారు. ఈ బియ్యంపై విచారణ చేయ గా ఇనుగుర్తి మండలం కోమటిపల్లిలోని బానోత్ శాంతి రేషన్ షాపు నుంచి ఈ బస్తాలు వచ్చాయని తేల్చారు. సరుకును సీజ్ చేసి మిల్లు యజమాని గోనె ఐలయ్య, రేషన్‌షాపు యజమానిపై కేసులు నమోదు చేసినటు డీసీఎస్‌వో తెలిపారు. ఈ తనిఖీల్లో డీపీసీఎస్‌వో రమేష్, సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ సీఐ వసంతకుమార్, స్థానిక తహసీల్దార్ దామోదర్, ఎంఆర్ఐ బాబు పాల్గొన్నారు.

భవిష్యత్ పదిలం

ఉన్నత విద్యామార్గానికి దిక్సూచి.. ఎస్సెస్సీ

- నేటి నుంచి టెన్త్ విద్యార్థులకు గ్రాండ్ టెస్టులు
- జిల్లా వ్యాప్తంగా హాజరుకానున్న 8,192 మంది
- వార్షిక పరీక్షల కోసం సన్నద్ధం
- ఆందోళన వద్దంటున్న విషయ నిపుణులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల భవిష్యత్‌కు తొలిమెట్టు పదో తరగతి. ఉన్నత విద్యామార్గానికి ఓ దిక్సూచి. ఉన్నతంగా ఎదగడానికి టెన్త్‌క్లాస్ ఎంతో కీలకం. ఈ ఏడాది మార్చి నుంచి జరిగే ఎస్సెస్సీ వార్షిక పరీక్షలు ఎలా రాస్తామని విద్యార్థులు, ఎట్లా రాణిస్తారని తల్లి దండ్రులు కలవరపడుతున్నారు. ఈ క్రమంలో మార్చి 21వ తేదీ నుంచి జరిగే పబ్లిక్ ఎగ్జామ్స్‌కు సన్నద్ధం ఎలా చేయాలి? ఉన్న సమయాన్ని వినియోగించుకొని విద్యార్థులను ఉత్తీర్ణులు చేయడానికి ఏం చేయాలి? అని కొత్త ప్రణాళికలతో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ విద్యాశాఖ అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. ఈ క్రమంలో రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులకు దాతలు, ఉపాధ్యాయుల ద్వారా అల్పాహారం అందజేశారు. ఈ నెల 1 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో స్టడీ అవర్స్ నిర్వహణకు సాయంత్రం వేళల్లో అల్పాహారం అందించేందుకు ప్రభుత్వం మహబూబాబాద్ జిల్లాకు రూ. 21,81,390 నిధులు విడుదల చేసింది. ఒక్కో విద్యార్థికి రోజూ రూ.15 ఖర్చు చేస్తున్నారు. కాగా, జిల్లాలోని వివిధ కేటగిరీల్లో 204 ఉన్నత పాఠశాలలు ఉండగా, వీటి నుంచి ఈ విద్యాసంవత్సరంలో 8,192 మంది విద్యార్థులు వార్షిక పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో బాలురు 4,189, బాలికలు 4,003 మంది ఉన్నారు. ఈ నెల 15 నుంచి ఎస్సెస్సీ విద్యార్థులకు గ్రాండ్ టెస్ట్ టెస్టులను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని విషయనిపుణుల సూచనలతో 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం.



తెలుగును అవగాహనతో చదవాలి..

తెలుగును అవగాహనతో విద్యార్థులు చదవాలి. బాగా విని ఆలోచిస్తూ రాయాలి. ప్రస్తుతం ఉన్న పాఠ్యాంశాలు పాత విధానంలో కాకుండా సొంత భావన, సృజనాత్మకత వెలికి తీసే విధంగా ఉన్నాయి. అర్థం చేసుకుంటూ చదవాలి. గతంలో మాదిరిగా కాదు. ఇప్పుడు బాగా రాస్తేనే మంచి మార్కులు వస్తాయి. అక్షర దోషాలు లేకుండా వాక్యనిర్మాణం రాయడం ప్రాక్టిస్ చేయాలి.

తక్కువ మార్కులని హిందీపై నిర్లక్ష్యం వద్దు..

హిందీలో పాస్ మార్కులు తక్కువ కదా! అని విద్యార్థులు నిర్లక్ష్యం చేయొద్దు. మనస్సు పెట్టి చదవాలి. హిందీ ప్యాసెజ్‌లు బాగా చదవాలి. ఇందులో 20 మార్కులు వస్తాయి. ప్రతీ పాఠంలో ఉండే కవి పరిచయాలను నేర్చుకోవాలి. పాఠంలో ఉండే బిట్స్‌ను బాగా నేర్చుకోవాలి. బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకుంటే మంచి స్కోరు వస్తుంది.

ఇంగ్లీష్ అంటే భయం వీడాలి...

ఇంగ్లీష్ అంటే భయాన్ని వీడాలి. పరీక్షల సన్నద్ధతకు అవసరమైన సమయం ఉంది. ఇప్పటి నుంచే ప్రణాళికబద్ధంగా ఉపాధ్యాయుడి మార్గదర్శకతతో ముందుకు సాగాలి. విద్యార్థులు ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలను అర్థం చేసుకుంటూ చదవాలి. గ్రామర్‌పై దృష్టిసారిస్తే సులభంగా మార్కులు స్కోర్ చేయవచ్చు. వీటితో పాటు చక్కటి రాతతో లెటర్‌రైటింగ్‌పై ఎక్కువ సాధన చేయాలి. విద్యార్థులు పరీక్షల్లో సృజనాత్మకత ప్రదర్శించి పరీక్షలు రాస్తే మంచి ఫలితాలు సొంతం చేసుకోవచ్చు.

గణితంలో మాదిరి ప్రశ్న పత్రాలను..

కొత్త సెలబస్ విధానంలో పరీక్ష ఉన్నప్పటికి సీసీఈ మోడలే కనుక ఇబ్బంది ఉండదు. గణితంలో ప్రధానంగా మాదిరి ప్రశ్నాపత్రాలను చూసి పట్టుదలతో సాధన చేయాలి. అభ్యాసంలో ఉండే ప్రశ్నలేకాకుండా వాటి అప్లికేషన్స్‌ను కూడ పూర్తిగా ఆకళింపు చేసుకోవాలి. పాఠశాలలో జరిగే సెలబస్, ఉపాధ్యాయులు తయారుచేసే ప్రశ్నాపత్రాలను అర్థం చేసుకొని, పరీక్షలకు ప్రిపేర్ కావాలి. ఏదేని ఒక ప్రాబ్లమ్‌ను పదేపదే ప్రాక్టిస్ చేస్తే ఫలితాలు మెరుగ్గా వస్తాయి. ఎలాంటి సందేహం ఉన్నా ఉపాధ్యాయుడిని సంప్రదించాలి.

బిట్స్ ప్రాక్టీస్‌తో సైన్స్‌లో రాణించాలి..

బిట్స్ బాగా ప్రాక్టిస్ చేయాలి. పాఠ్యపుస్తకాలను బాగా చదవాలి. ప్రతీ విద్యార్థి పాఠ్యపుస్తకాన్ని క్షుణ్ణంగా చదవాలి. ఏ ప్రశ్న ఇచ్చినా రాసే స్థాయికి రావాలి. బట్టి పడితే అలా రాయడం కష్టమవుతుంది. ఆ విధానానికి స్వస్తి చెప్పి, అర్థం చేసుకుంటూ చదవాలి. 1, 2 మార్కుల ప్రశ్నల పైన దృష్టిసారించాలి. వీటికైతే సింపుల్‌గా రాసినా మార్కులు వచ్చేదానికి అవకాశం ఉంటుంది. ఇప్పటి నుంచే ప్రణాళిక బద్ధంగా చదవితే మంచి మార్కులను సాధించవచ్చు.

సాంఘికశాస్త్రంలో..

ఆలోచించి రాసే విధంగా జనరల్ అవగాహన కూడా అవసరం. సాంఘికలో ముఖ్యంగా ఆలోచించి రాసే విధంగా విద్యార్థులు తయారు కావాలి. బట్టి పట్టి రాసే విధానాన్ని స్వస్తి పలకాలి. బాగా చదవడం ప్రాక్టిస్ చేయాలి. ముఖ్యాంశాలను రాయడం ప్రాక్టిస్ తరహాలో కొనసాగించాలి. ఉన్న విషయాలను విశదీకరణగా రాస్తే మంచి మార్కులు వచ్చే అవకాశం ఉంటుంది.

పరీక్షలంటే ఆందోళన చెందొద్దు

- రవీందర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి



వచ్చేనెల 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించాలంటే ఆందోళన చెందవద్దు. పరీక్షల్లో ఏ పాఠ్యాంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. వాటిని ఏ విధంగా రాయాలి అనే ఆలోచన విద్యార్థులకు రావాలి. పరీక్షలంటే భయం వీడి ఎలాంటి ఆందోళన లేకుండా వార్షిక పరీక్షలు రాయొచ్చు. వార్షిక పరీక్షలు మంచిగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించటానికి సబ్జెక్టుల వారిగా వివిధ పాఠ్యాంశాలపై పట్టుసాధించాలి.

సేవాఘడ్ వద్ద ఉద్రిక్తత

- వివాదంలో సేవాలాల్ ఆలయ భూమి
- కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గాల ఘర్షణ
- గేటుకు తాళం వేసి.. మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌ను అడ్డుకున్న పోలీసులు



సేవాఘడ్ వద్ద ఆలయంలోనికి రాకుండా మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌ను అడ్డుకుంటున్న పోలీసులు, భోగ్‌భండారో వద్ద నైవేద్యం తయారు చేస్తున్న గిన్నెలను పడేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్ అనుచరులు

నెహ్రూ సెంటర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : బంజరాల ఆరాధ్యదైవం శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను పురస్కరించుకుని తొలి శుక్రవారం నిర్వహించే బోగ్ భండారో కార్యక్రమంలో సేవాఘడ్ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు అనంతారం సేవాఘడ్ వద్ద సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను ఏటా నిర్వహిస్తూ సంబరాలు చేసుకుంటున్నారు. ప్రతీ సంవత్సరం లాగే.. ఈ సారి కూడా వేడుకలు నిర్వహించుకోవడానికి గిరిజనులు, ప్రజాసంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నేతలు సంసిద్ధమై సేవాఘడ్ వద్దకు చేరుకుని, బోగ్ భండారో ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలో.. ఈ స్థలంలో మీరెవరంటే.. మీరేవరంటూ పరస్పరం మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అనుచరులు, ప్రస్తుత ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అనుచరుల మధ్య వాగ్వావా దం చోటు చేసుకుని ఉద్రిక్తతకు దారి తీసింది. శంకర్‌నాయక్ అనుచరులు బోగ్‌భండారో నైవేద్యాన్ని తయారు చేస్తుండగా, మురళీనాయక్ అనుచరులు ఇక్కడ చేసేందుకు మీకు హక్కులేదని గిన్నెలను పడేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలను కట్టడి చేసే ప్రయత్నం చేశారు. శంకర్‌నాయక్ అక్కడికి చేరుకుని అధికారులతో మాట్లాడి ఇది మా ఆస్తి అంటూ.. మా ఇంట్లోకి మమ్మల్ని వెళ్లనివ్వాలని పోలీసులను కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని పోలీసులు శంకర్‌నాయక్ - సీతామహాలక్ష్మి దంపతులను లోపలికి అనుమతించలేదు. దీంతో సుమారు రెండు గం టల పాటు గేటు వద్దనే నిరీక్షించి, వెనుదిరిగి వెళ్లారు. అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సేవాలాల్ జయంతి ఉత్సవాల ఏర్పాట్లను చేస్తున్నారు. సేవాఘడ్ వద్ద ఎలాం టి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక డీఎస్పీ తిరుపతిరావు నేతృత్వంలో అధికారులు, సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు పెద్దఎత్తున మోహరించారు. ఇదిలా ఉండగా ఉత్సవాల తొలిరోజు జరగాల్సిన బోగ్ భండారో కార్యక్రమం నిలిచిపోయింది.



ఘటనా స్థలంలో వీరన్న, హుస్సేన్ మృతదేహాలు

ఖమ్మం జిల్లాలో రోడ్డు ప్రమాదం

- గ్రానైట్ బండల లారీ బోల్తా.. ఇద్దరి దుర్మరణం
- మృతుల్లో డోర్నకల్ మండల వాసి

ముదిగొండ/డోర్నకల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : పొట్టకూటి కోసం వచ్చి రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోగా, మరో ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన ఖమ్మం జిల్లా ముదిగొండ సమీపంలోని నేషనల్ హైవేపై శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం రాముతండాకు చెందిన నునావత్ వీరన్న(28), భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం కొమరారం బాలుతండాకుచెందిన బానోతు హుస్సేన్(35) బతుకుదెరువు కోసం వచ్చి ఖమ్మం కైకొండాయిగూడెంలో నివసిస్తున్నారు. వీరు గ్రానైట్ బండలను లోడింగ్, అన్‌లోడింగ్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోజులాగానే శుక్రవారం ఉదయం నేలకొండపల్లి మండలం గువ్వలగూడెం వద్దగల గ్రానైట్ ఫ్యాక్టరీ నుంచి అన్‌పాలీష్ బండలను డీసీఎం వ్యాన్‌లో లోడింగ్ చేసుకొని బయలుదేరారు.

ఈ క్రమంలో ముదిగొండ వద్ద జాతీయ రహదారిపై డ్రైవర్ అతివేగంగా నడపడంతో వ్యాన్ వీల్‌బోల్ట్ విరిగి బోల్తాపడింది. దీంతో గ్రానైట్ బండలపై కూర్చొని ఉన్న వీరన్న, హుస్సేన్, బానోతు రాందాస్, వాంకుడోతు కర్ణా, అశోక్, బానోతు కుమార్, బోడా సుందర్, రవి, తేజావత్ వినోద్, డ్రైవర్ వీరన్న కిందపడిపోయారు. వీరిలో వీరన్న, హుస్సేన్‌లు గ్రానైట్ బండల మధ్య నలిగిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనం ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుడు నునావత్ వీరన్నకు భార్య భార్గవి, కుమారుడు, కుమార్తె ఉండగా, మరో మృతుడు బానోతు హుస్సేన్‌కు భార్య రూత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరన్న భార్య భార్గవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ మురళీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యానశాఖలో ఏం జరుగుతోంది?

- జిల్లా అధికారి సంజీవరావు ఆకస్మిక బదిలీ
- బాధ్యతలు చేపట్టిన ఏడు రోజుల్లోనే కొత్త అధికారి ట్రాన్స్‌ఫర్
- అయోమయ పరిస్థితుల్లో కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది, అన్నదాతలు



భూపాలపల్లి కృష్ణకాలనీ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా ఉద్యానవన శాఖలో అసలేం జరుగుతోందనే చర్చ సర్వత్రా సాగుతోంది. ఉన్న అధికారి ఆకస్మిక బదిలీ.. కొత్తగా విధుల్లో చేరిన అధికారి సైతం ఆకస్మిక బదిలీలో అయోమయ పరిస్థితి నెలకొంది. జిల్లా ఉద్యానవన శాఖ అధికారిగా పనిచేసిన సంజీవరావు గత డిసెంబరు 19న ఆకస్మికంగా బదిలీ అయ్యారు. ఏటూరునాగారానికి బదిలీ చేస్తూ ఈ శాఖ డైరెక్టర్ నుంచి ఉత్తర్వులు అందాయి. దీంతో ఆయన అక్కడ విధుల్లో చేరలేదు. బదిలీ ఆర్డర్ వచ్చిన తదుపరి సంజీవరావు లాంగ్ లీవ్ పెట్టగా ఆయన స్థానంలో హనుమకొండ హార్టికల్చర్ అధికారిగా పనిచేస్తున్న వెంకటేశంకు బాధ్యతలు అప్పగించారు. ఆ తదుపరి జనవరి 25న హైదరాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి అనే ఉద్యోగికి జిల్లాలో పూర్తి స్థాయి బాధ్యతలు ఇచ్చి పోస్టింగ్ ఇచ్చారు. ఆయన కూడా విధుల్లో చేరి వివిధ కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నారు. ఈ క్రమంలో ఉన్నట్టుండి ఈ నెల 12న సాయంత్రం శ్రీకాంత్‌రెడ్డిని మళ్లీ హైదరాబాద్‌కు బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వులు అందాయి. మళ్లీ తిరిగి హన్మకొండ హార్టికల్చర్ అధికారికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అనతి కాలంలోనే జిల్లా అధికారి బదిలీ.. నియామకమైన అధికారి వెనువెంట బదిలీ తీవ్ర చర్చనీయాంశమవుతోంది. అసలే ఈ శాఖలో సరిపడాసిబ్బందిలేరు. ఆయిల్‌పాం సైతం అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఏడాది 2వేల ఎకరాలు సాగు టార్గెట్ ఉండగా.. ఇప్పటివరకు కేవలం 360పై చిలుకు ఎకరాల్లో మాత్రమే సాగు అయినట్లు తెలిసింది. మరోవైపు ఈ అనిశ్చితితో ఉద్యానవనశాఖ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బందితో ఓ వైపు.. అన్నదాతల్లో మరోవైపు గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ శాఖ పరిస్థితి రాబోయే రోజుల్లో మరెలా ఉండబోతుందోననే చర్చ జిల్లాలో జోరుగా సాగుతోంది.

బీఆర్ఎస్ నేతలకు మతి భ్రమించింది..

- కేటీఆర్, కవితలకు వింత జబ్బు సోకింది
- పేపర్లలో ఫొటో కనిపించకపోతే వారికి పిచ్చిలేస్తోంది
- ఉప ఎన్నికలు ఎదుర్కోవడానికి కాంగ్రెస్ సిద్ధంగా ఉంది
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నాయకులు అధికారం కోల్పోయి, మతిభ్రమించి మాట్లాడుతున్నారని, పేపర్లలో కనిపించకపోతే వారికి పిచ్చిలేస్తోందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఎద్దేవా చేశారు. శుక్రవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పదవి, అధికారం లేకుండా ప్రజాసేవా చేసే అలవాటు బీఆర్ఎస్ నాయకులకు లేదన్నారు. అందుకే ప్రభుత్వం ఎప్పుడు పడిపోతుందా, ఎప్పుడు అధికారంలోకి రావాలా అన్న ఆలోచనలో ఉన్నారని, బీఆర్ఎస్ నేతలు తొందరపడొద్దని, నాలుగేళ్లు వేచి ఉండాలని, అప్పుడే ఎన్నికలు వస్తాయన్నారు. ఒకవేళ ఉప ఎన్నికలు వచ్చినా ఎదుర్కోవడానికి తాము సిద్ధమేనని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడకముందు రాష్ట్రం మిగులు బడ్జెట్ ఉంటే, బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్ స్పష్టం చేసినట్టు గుర్తుచేశారు. కేటీఆర్, కవితలకు వింత జబ్బు సోకిందని, పత్రికలు, మీడియాలో వారి ముఖాలు కనిపించకపోతే అయ్యో ఎక్కడ వెనుకబడిపోతామోననే వింత జబ్బుతో బాధపడుతున్నారని దుయ్యబట్టారు. బీసీల రిజర్వేషన్లపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడడం విడ్డూరంగా ఉందని, బీసీల విషయం ఆమెకు ఏం అవసరమని, ఆమెను ఎవరడిగారని, అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ బీసీ రిజర్వేషన్లకు కట్టుబడి ఉందని, 42 శాతంకు బీసీ రిజర్వేషన్లు పెంచి ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధంగా ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉందని, ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి అమలు చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. ఆర్థిక వెనులుబాటును చూసుకొని కార్యక్రమాలను అమలు చేస్తూ ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు.

న్యాయమూర్తిపై దాడి చేసిన వ్యక్తిని శిక్షించాలి

- బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కలువకొలను ప్రవీణ్ రాజు



పట్టణ కేంద్రంలోని కోర్టు ఆవరణలో నిరసన చేపడుతున్న న్యాయవాదులు

తొర్రూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి కోర్టులో మహిళా జిల్లా న్యాయమూర్తిపై దాడి చేసిన ముద్దాయిని కఠినంగా శిక్షించాలని బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కలువకొలను ప్రవీణ్‌రాజు, జనరల్ సెక్రటరీ రామకృష్ణ ఘనపురం పేర్కొన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని కోర్టు ఆవరణలో విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయ వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులపై నిత్యం జరుగుతున్న దాడులు అమానవీయమని, బాధ్యులైన ముద్దాయిని తక్షణమే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలను న్యాయవాదులు ఉపేక్షించేదిలేదని, దేశంలో ఏ వర్గం నుంచి ఎక్కడ అన్యాయం జరిగినా ఐక్యతతో న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు బండపెల్లి వెంకన్న, మహేష్, వెంకటేశ్వరస్వామి, రఘురామ్‌రెడ్డి, అయిలోని, లాలు, యాకేందర్, క్రుపావతి, గోపాల్, ప్రవీణ్, శ్రీనివాస్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

నర్సింహులపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జయపురం గ్రామంలో సీతారామ రుక్మిణీ సహిత వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. చివరి రోజు శుక్రవారం ఆరాధన, మహాపూర్ణాహుతి, చక్రస్నానం, ఆరగింపుతో పాటు స్వామి వారి పారివేట, తీర్థప్రసాదం అనంతరం సాయంత్రం బండ్లు తిరుగుడు కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని పలువురు రైతులు ఎద్దుల బండ్లను, ట్రాక్టర్లు, ట్రాలీవాహనాలను అలంకరించి కుటుంబ సమేతంగా ఆలయాల చుట్టూ ప్రదక్షణలు చేశారు. కోరిన కోర్కెలు తీర్చి ఆయురారోగ్యాలతో సల్లంగా చూడు స్వామి అని మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ నేలకుర్తి అశోక్‌రెడ్డి, నర్సింహారెడ్డి, చంద్రారెడ్డి, సత్తిరెడ్డి, ఐలయ్య, భద్రయ్య, రామూర్తి, ప్రసాద్, వెంకన్న శ్రీను, శేఖర్ పాల్గొన్నారు.



జయపురంలో బండ్ల ప్రదక్షిణల దృశ్యం

పుల్వామ అమర జవాన్ల త్యాగం మరువలేనిది

తొర్రూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పుల్వామలో అమరులైన వీరయోధులను స్మరిస్తూ తొర్రూరు పట్టణ కేంద్రంలో బీజేపీ అర్బన్ అధ్యక్షుడు పైండ్ల రాజేష్, రాష్ట్ర నాయకుడు గాదె రాంబాబు ఆధ్వర్యంలో అమరుల స్థూపం వద్ద అమర జవాన్ల చిత్రటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019లో జమ్మూ నుంచి శ్రీనగర్ వెళుతున్న భారత సైనికులపై పుల్వామ వద్ద పాకిస్థాన్ ప్రేరపిత ఉగ్రమూకలు దొంగచాటుగా బాంబు దాడులకు పాల్పడడంతో 20 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారని, అమరుల త్యాగాలు మరువలేనివని అన్నారు. కార్యక్రమంలో పూసాల శ్రీమాన్, కొలుపుల శంకర్, పల్లె కుమార్, రాంబాబు, శ్రావణ్, రవిబాబు, యాకయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం

పెద్దవంగర, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ - ఖమ్మం -నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగ రాములుగౌడ్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల అధ్యక్షుడు బొమ్మరబోయిన సుధాకర్ యాదవ్ బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఢిల్లీలో బీజేపీ గెలవడానికి ప్రధాన మంత్రి మోదీ చేపట్టిన, సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలే కారణమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజల తరపున పోరాటం చేయాలన్నా, మండలిలో ప్రశ్నించాలన్నా బీజేపీ అభ్యర్థితోనే సాధ్యమవుతుందన్నారు. ఎన్నికల్లో ఉద్యోగ, ఉపాధ్యాయులకు 5 డీఏలు, పీఆర్సీ అమలు చేస్తామని చెప్పి కనీసం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కట్టజోజు భాస్కర్, రాము, ఆనంద్, సందీప్, కుమార్, అన్వేష్, ప్రశాంత్, సురేష్ పాల్గొన్నారు.



మండల కేంద్రంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఐలాపూర్ సమ్మక్క, సారలమ్మను దర్శించుకున్న మంత్రి సీతక్క

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం ఐలాపూర్‌లోని వనదేవతలు సమ్మక్క, సారలమ్మ తల్లులను రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) శుక్రవారం దర్శించుకున్నారు. దర్శనానికి వచ్చిన సీతక్కను పూజారులు సన్నాయి మేళాలతో ఎదుర్కొని స్వాగతం పలికారు. అనంతరం మేకపోతులను మొక్కి తల్లులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ జాతరకు వచ్చే, వెళ్లే భక్తులు తగు జాగ్రత్తలు తీసుకుని ప్రయాణాలు చేయాలని సూచించారు. అడవిలో జాతర జరుగుతున్నందున్న భక్తులు ఎవరు కూడా అడవిలోని చెట్లను నరక రాదని, పర్యావరణాన్ని కాపాడు కోని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇరవై ఏళ్లగా ప్రతీ జాతరకు వస్తున్నానని ఈ జతరకు తల్లుల దీవనలతో రాష్ట్ర మంత్రిగా ప్రజలకు సేవ చేసే బాధ్యతతో వచ్చానని పేరొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎండి అప్సర్ పాషా, డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న , రఘు, రాంబాబు, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



వనదేవతలను దర్శించుకున్న మంత్రి సీతక్క

అధికారుల అలసత్వంతోనే గనుల్లో సమస్యలు

- సంస్థలో ప్రక్షాళన జరిగితేనే మరో వందేళ్ల భవిష్యత్
- సమస్యలు తెలుసుకునేందుకే కార్మిక చైతన్య యాత్ర
- సింగరేణి సీఎండీ బలరాం నాయక్



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఎండీ బలరాంనాయక్

కాకతీయఖని, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి అధికారుల అలసత్వంతోనే బొగ్గు గనుల్లో సమస్యలు పేరుకుపోయాయని సీఎండీ బలరాం నాయక్ అన్నారు. కార్మిక చైతన్య యాత్రలో భాగంగా డైరెక్టర్ (ఈఅండ్‌ఎం) సత్యనారాయణరావు, డైరెక్టర్ (ఓపీ) ఎల్‌వీ సూర్యనారాయణ, డైరెక్టర్ (పీపీ) వెంకటేశ్వర్లుతో కలిసి శుక్రవారం భూపాలపల్లి ఏరియాలో పర్యటించారు. కేటీకే-5, కేటీకే-1, ఓసీ-2, కేటీకే-6వ గని ఉద్యోగులు వారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కార్మికులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారో తెలియజేయాలని ఉద్యోగులను అడుగగా మ్యాన్ రైడింగ్, ఎస్‌డీఎల్ యంత్రాల సమస్య, స్టోవింగ్ చేసేందుకు సాండ్ కొరత, బొగ్గు తీసుకొచ్చేందుకు సరిపడా టబ్బులు లేవని, యంత్రాలకు వినియోగించే హైడ్రాలిక్ ఆయిల్ నాసిరకంగా ఉందని, ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్‌ల సమస్య, వివిధ పనులకు సరిపడ మెటీరియల్ రావడం లేదని, కాలం చెల్లిన యంత్రాలు ఉన్నాయని, క్యాట్ లోడర్లు సరిపడా లేవని, సింగరేణి ఆస్పత్రి వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, ఆస్పత్రిలో వైద్యుల కొరత వేదిస్తోందని, రాత్రి సమయంలో స్కానింగ్ స్వీపర్లతో తీయిస్తున్నారని, వీటితో పాటు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నామని సీ అండ్ ఎండీకి విన్నవించుకున్నారు. దీంతో బలరాంనాయక్ మాట్లాడుతూ సింగరేణిని భుజాలపై మోసింది పాతతరం కార్మికులని, వారిని ఆదర్శంగా తీసుకుని ప్రస్తుత కార్మికులు రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిని సాధించాలన్నారు. సమస్యలు ఎన్ని ఉన్నప్పటికీ వాటిని అధిగమిస్తూ ముందుకు సాగాలన్నారు. అనుకున్న స్థాయిలో బొగ్గు ఉత్పత్తి రాకుంటే సంస్థ మనుగడకు ప్రమాదమని, సింగరేణి నిర్వీర్యమైతే అధికారులు, ఉద్యోగులు, కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ఎవరూ ఉండరని అన్నారు. పక్కన గోదావరి పెట్టుకుని సాండ్ కొరత ఉందనడం అది ముమ్మాటికి అధికారుల తప్పిదమేనన్నారు. కార్మికుల గైరుహాజరు బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగిస్తుందని అధికారులు అంటున్నారు, ఉద్యోగాలు లేక చాలా మంది ఇబ్బందులు పడుతున్నారని, గైరుహాజరు అవుతున్న కార్మికులను తొలగించి కొత్తవారికి అవకాశం ఇద్దామా... లేక సక్రమంగా విధులకు హాజరై సంస్థ అభివృద్ధికి తోడ్పడుదామా అని ప్రశ్నించారు. కేటీపీపీ ఉన్నతాధికారులతో మాట్లాడి బాటం యాష్ వచ్చేలా చూస్తామన్నారు. సాండ్ స్టోవింగ్, మ్యాన్‌రైడింగ్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్మికుల వైద్యం కోసం సంవత్సరానికి రూ.500 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. రూ.100 కోట్లు పెడితే సింగరేణిలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. సింగరేణి ఆస్పత్రులలో పనిచేస్తున్న వైద్యులు ప్రిస్క్రిప్షనిస్టులుగా మారారని అన్నారు. ఆస్పత్రుల అడ్మినిస్ట్రేషన్ కోసం ఆర్మీ డాక్టర్‌ను తీసుకు వస్తున్నామని, అందుకోసం ఇప్పటికే ప్రకటన ఇచ్చామన్నారు. బయట మార్కెట్‌లో బొగ్గు తక్కువ ధరకు లభిస్తోందని, సింగరేణిలో కాస్ట్ ఆఫ్ ప్రొడక్షన్ తగ్గించుకుంటేనే మంచిదన్నారు. ఓసీ-2 టన్నుకు రూ. 78 నష్టాల్లో ఉందని ఓపెన్ కాస్ట్‌లు నష్టాల్లో నడవడం సరికాదని హెచ్చరించారు. తాడిచెర్ల ఓసీ సింగరేణికి వస్తే ఉపాధి పెరుగుతుందన్నారు. సింగరేణిలో ప్రక్షాళన జరిగితే మరో వందేళ్ల భవిష్యత్ ఉంటుందని అన్నారు. భూపాలపల్లి ఏరియా కార్మికులు చాలా ఉత్సాహవంతంగా ఉన్నారని అన్నారు. గైరు హాజరు శాతాన్ని తగ్గించి, యంత్రాల పని గంటలను పెంచేలా కృషిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం కేటీకే-5వ గని ఆవరణలో ఏర్పాటు చేసిన బలరామ నందనవనంలో మొక్కలు నాటారు. ఓసీ-2 వ్యూ పాయింట్‌కు వెళ్లి పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి, జీఎం (సీపీపీ) మనోహర్, జీఎం(యాజీ) రఘురాంరెడ్డి, సింగరేణి అధికారులు కవీంద్ర, జ్యోతి, జీఎల్ ప్రసాద్, రామకృష్ణారెడ్డి, వెంకట్రామిరెడ్డి, వెంకటరమణ, మారుతి, జాకీర్‌హుస్సేన్, తిరుపతి, కృష్ణప్రసాద్, నజీర్, కార్మిక సంఘాల నాయకులు రాజ్‌కుమార్, రాజేందర్, రమేష్, మధూకర్‌రెడ్డి, సమ్మిరెడ్డి, బుచ్చయ్య, కట్టికోల కృష్ణ, దేవరకొండ మధు తదితదరులు పాల్గొన్నారు.

రామప్పను సందర్శించిన ఆస్ట్రేలియా దేశస్థులు

వెంకటాపూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలంపేట గ్రామంలో గల యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని శుక్రవారం ఆస్ట్రేలియా దేశానికి చెందిన హెర్బెట్, కామిన్స్కైలు సందర్శించారు. ఈసందర్భంగా వారు రామలింగేశ్వర స్వామిని దర్శించుకోగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ శిల్పకళా సంపద, చరిత్ర గురించి గైడ్ కరుణానిధిని అడిగి తెలుసుకున్నారు. ఆలయ తూర్పు ముఖద్వారాన ఉన్న నందీశ్వరుడిని దర్శించుకుని చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అక్కడినుంచి సరస్సు వద్దకు చేరుకుని బోటులో విహరిస్తూ ప్రకృతి అందాలను తిలకించారు.



ఆస్ట్రేలియన్లకు ఆలయ శిల్పకళా సంపద గురించి వివరిస్తున్న గైడ్ కరుణానిధి

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2301	2100
పల్లికాయ (సూక)	6500	4600
పల్లికాయ (పచ్చిది)	4500	3100
కందులు	7206	5540
పెసళ్లు	7259	5645
పత్తి	6820	5800
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	13600	9000
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	15500	11500
ఎల్లో మిర్చి	-	-
యూఎస్341	13650	11500
దేశీ ఏసీ	-	-
దీపిక	17500	15245
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎన్పీడీసీఎల్ వరంగల్ చైర్‌పర్సన్ వేణుగోపాలచారి



వినియోగదారుల సదస్సులో ఫిర్యాదులు స్వీకరిస్తున్న వేణుగోపాలచారి

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ సీజీఆర్ఎఫ్-1 టీజీ వరంగల్ చైర్‌పర్సన్ వేణుగోపాలచారి అన్నారు. మహబూబాబాద్‌లోని విద్యుత్ రూరల్ ఏఈ కార్యాలయంలో శుక్రవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను నిర్వహించి ఫిర్యాదుదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ బిల్లుల్లో లోపాలను సరిచేయడం, విద్యుత్ వోల్టేజీ హెచ్చుతగ్గులను, క్యాటగిరి మార్పిడి, లోడ్ వివాదం, లూజువైర్లను సరిచేయడం లాంటి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకున్నట్లుచెప్పారు. స్థానికంగా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ ఆయా ప్రాంతాల్లో ప్రతినెల లోక్ అదాలత్ నిర్వహిస్తూ సమస్యలను పరిష్కరిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. మహబూబాబాద్ మండలం మాధవాపురం గ్రామానికి చెందిన రైతు సుధాకర్‌రెడ్డి ఒకే ట్రాన్స్‌ఫారం నుంచి 30 మోటార్లు నడిపిస్తుండడంతో లో వోల్టేజీ సమస్య ఏర్పడుతుందని ఫిర్యాదు చేశాడు. ఇందుకు స్పందించిన అధికారులు మరో ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలని ఆదేశించారు. అమనగల్, కంబాలపల్లి, బేతోలు గ్రామాల్లో లూజు వైర్ల సమస్య ఉందని, త్వరలోనే ఆ సమస్యను పరిష్కరిస్తామని అధికారులు వివరణ ఇచ్చారు. వేంనూరు గ్రామానికి చెందిన అనిల్ మూడు సంవత్సరాలకు ఒకేసారి బిల్లు రీడింగ్ తీయడంతో రూ.12500 వచ్చిందని, రూ.5వేలు చెల్లించినప్పటికి అందులో నుంచి ఆ నగదును మొత్తం బిల్లు నుంచి తీసివేయకుండ అలాగే ఉందని పేర్కొన్నారు. మల్యాల గ్రామశివారు కంబాలతండాకు చెందిన గిరిజన రైతుజామ్లా తన ఇంటిపై నుంచి 11 కేవీ విద్యుత్ వైర్లు పోవడంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందని ఫిర్యాదు చేశాడు. త్వరలోనే సమస్యకు పరిష్కారంచూపుతామని హామీఇచ్చారు. సమావేశంలో టెక్నికల్ మెంబర్ కె.రమేష్, ఫైనాన్స్‌మెంబర్ చరణ్‌దాస్, ఇండిపెండెంట్ మెంబర్ రామారావు, ఎస్సీ నరేష్, డీఈలు విజయ్, సునీత, ఏడీఈ ఉపేందర్, ఏఈలు వెంకటేష్, సంగీత, నవ్యశ్రీ, జేఎల్‌ఎంలు పాల్గొన్నారు.

భక్త జనసంద్రం

చిన్నజాతరకు పోటెత్తుతున్న జనం



భక్తులతో రద్దీగా గద్దెల ప్రాంగణం



- మూడోరోజు 2లక్షల మందికిపైగా రాక
- సందడిగా మేడారం పరిసరాలు, వనదేవతల గద్దెలు
- నేడు ముగియనున్న మినీ సంబురం

తాడ్వాయి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మినీ జాతరతో మేడారం జనసంద్రమవుతోంది. ఈ వేడుకల్లో భాగంగా శుక్రవారం పూజారులు మేడారంలోని సమ్మక్క, కన్నెపల్లిలోని సారలమ్మ పూజా మందిరాల్లో అంతర్గత పూజలను కొనసాగించారు. ఈ క్రమంలో తరలివచ్చిన లక్షలాది భక్తులు తల్లులను దర్శించుకున్నారు. శుక్రవారం సుమారు 2లక్షలకు పైగా తరలివచ్చిన భక్తజనంతో మేడారం పరిసరాలన్ని సందడిగా మారాయి. ఈ మూడురోజుల్లో సుమారు 6లక్షల మంది అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు వెల్లడించారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు గద్దెలకు చేరుకొని ఎత్తు బంగారం(బెల్లం), చీర, సారె, పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, కొబ్బరికాయలు, యాట మొక్కులను చెల్లించుకుంటున్నారు.

భక్తులకు దొరకని ప్రసాదం

సుదూర ప్రాంతాల నుంచి మేడారం తరలివచ్చే భక్తులు మొక్కులు చెల్లించుకొని అమ్మవారి పసుపు కుంకుమ కొబ్బరిముక్క వనదేవతలకు ప్రీతికరమైన బంగారాన్ని ప్రసాదంగా తీసుకుంటారు. అయితే చాలామంది భక్తులకు ప్రసాదం దొరకడం లేదని వెంటవెంటనే తొలగించి భక్తులకు దొరకకుండా చేస్తున్నారని భక్తులు అంటున్నారు. తమకు కొంచె ప్రసాదం ఇవ్వండి అని అడిగినా ఇవ్వడంలేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని జాతరలుగా బెల్లం ప్రసాదంగా భక్తులకు పంపిణీ చేయాలని అధికారులు పలు ప్రయత్నాలు చేసి విఫలమవుతున్నారు. మేడారంలో భక్తులకు వనదేవతల ప్రసాదం ఎప్పటికి అందిచగలుగుతారని వారు ప్రశ్నిస్తున్నారు.



నేటితో ముగియనున్న మినీ జాతర

సమ్మక్క సారలమ్మల మినీ జాతర శనివారంతో ముగియనుంది. ఈ సందర్భంగా పూజారులు తల్లులకు చేస్తున్న అంతర్గత పూజలను కూడా ముగించనున్నారు. చివరి రోజు శనివారం వారాంతం కావడంతో పెద్ద సంఖ్యలో వస్తారని, అలాగే ఆదివారం కూడా అధికంగా వస్తారని అంచనాలు వేసిన అధికారులు అందుకు తగినట్టుగా ఏర్పాట్లు చేశారు.

దేవస్థానానికి ఆర్థిక నష్టం

మేడారం మినీ జాతరలో దేవాదాయ శాఖకు ఆర్థిక నష్టం జరుగుతుందని పలువురు ఆదివాసీ సంఘాల నాయకులు అంటున్నారు. మినీ జాతరలో కొబ్బరి, బెల్లం, జుట్టు(తలనీలాలు), కోళ్ల పలు వ్యాపారలపై ఎలాంటి ఆంక్షలు లేకుండా కోట్లలో వ్యాపారాలు జరుగుతున్నాయని ఒకరిద్దరి స్వార్థానికి దేవాదాయ శాఖకు ఆర్థిక నష్టం జరుగుతోందని అంటున్నారు. ప్రతీ వ్యాపారంపై రుసుం వసూలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



జంపన్నవాగు వద్ద స్నానాలు ఆచరిస్తున్న భక్తజనం



వనదేవతలకు యాటమొక్కులు చెల్లిస్తున్న భక్తులు

గాడి తప్పిన పారిశుధ్య నిర్వహణ

మేడారం పరిసరాల్లో పారిశుధ్య పనులు గాడితప్పయని భక్తులు ఆరోపిస్తున్నారు. లక్షల మంది వస్తున్న సమయంలో పారిశుధ్య పనులు చురుగ్గా జరగక పోవడంతో ఎక్కడి వ్యర్థాలు అక్కడే దర్శనమిస్తున్నాయని మండిపడుతున్నారు. డీపీవో దేవరాజ్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు జరుగుతుండగా.. మూడురోజులలోనే అధికారులు అలసిపోయారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పుడే ఇలా చేస్తే జాతర తరువాత పరిస్థితేంటని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



మేడారం పరిసరాల్లో పేరుకుపోయిన వ్యర్థాలు

పటిష్ఠ ఏర్పాట్లతో సందడిగా మినీ జాతరలు

- ములుగు కలెక్టర్ దివాకర
- మేడారంలో విలేకరుల సమావేశం

తాడ్వాయి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): యంత్రాంగం చేసిన పటిష్ఠ ఏర్పాట్లతో ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం, కన్నాయిగూడెం మండలం ఐలాపూర్, ఏటూరునాగారం మండలం కొండాయి, మల్యాల గ్రామాల్లో జరుగుతున్న వనదేవతల మినీ జాతరలు సందడిగా జరుగుతున్నాయని కలెక్టర్ టీఎస్ దివాకర పేర్కొన్నారు. శుక్రవారం మేడారంలో సమ్మక్క, సారలమ్మ తల్లులను దర్శించుకొని మొక్కులు చెల్లించిన ఆయన అనంతరం ఐటీడీఏ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మేడారం మినీ జాతర సందర్భంగా ఇప్పటి వరకు 5లక్షల మందికి పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని, అలాగే ఇతర గ్రామాల్లో జరుగుతున్న మినీ జాతరల్లో కూడా 3లక్షల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారని తెలిపారు. శని, ఆదివారాల్లో మేడారానికి భక్తులు భారీసంఖ్యలో తరలి వస్తారని అంచనాలతో ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించామన్నారు. అలాగే 2026లో రానున్న మేడారం మహా జాతరకు కూడా ఇదే తరహాలో ఏర్పాట్లు చేసి భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి ఎండీ రఫిక్, మేడారం దేవస్థానం కార్యనిర్వహణ అధికారి రాజేంద్రం, డీడబ్ల్యూవో శిరీష, ఐటీడీఏ ఎస్వో రాజ్‌కుమార్, తహసిల్దార్‌లు జగదీశ్వర్, రవీందర్, సృజన్‌కుమార్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లడుతున్న కలెక్టర్ దివాకర

ప్రేమగా.. గమ్మత్తుగా..

ఐదుగురు బావమరుదులకు ఒకేసారి కల్లు తాపించిన బావ

గ్రామీణప్రాంతాల్లో బావ, బావమరుదుల మధ్య సరదా సంభాషణలు.. సరదా సవాళ్లు సాధారణంగానే జరుగుతుంటాయి. అలా కేసముద్రం మండలం ఉప్పరపల్లికి చెందిన ఎలబోయిన సారయ్యకు అదే గ్రామానికి చెందిన ఆయనకు బావమరుదుల వరుసైన బోనగిరి రమేష్, వీరయ్య, చాగంటి వెంకటేశ్వర్లు, గాదె యాకస్వామి, అంకిరెడ్డి రాంబాబులతో శుక్రవారం ఉదయం ఓ సరదా సంభాషణ జరిగింది. ఆసమయం లోనే సారయ్య... వారికి ఒకేసారి కల్లుతాపిస్తానని అనడంతో.. వారు కూడా చాలెంజ్ విసిరారు. దాంతో సారయ్య ఇదిగో ఇలా.. ఓ పీవీసీ పైపు రంధ్రాలు చేసి.. గ్రామ సమీపంలోని గణపురం తాటివనం వద్ద బావమరుదుల మధ్య కూర్చుని కల్లు తాగారు. దీంతో బావ ఐడియా భళా అంటూ బావమరుదులు ప్రశంసించారు. సోషల్‌మీడియాలో వైరల్ అయిన ఈ దృశ్యాలు చూసిన వారు 'బావ ప్రేమగా.. గమ్మత్తుగా' ఐడియా వేశాడు అంటూ ఆసక్తిగా చూశారు.



పీవీసీ పైప్ సాయంతో ఒకేసారి కల్లు తాగుతున్న బావ (మధ్యలో వ్యక్తి), బావమరుదులు

- కేసముద్రం, ఆంధ్రజ్యోతి



రాకాసి గాలులు.. మిగిలిన మోడులు..

పచ్చని వనంలో రాకాసి గాలుల విధ్వంసానికి నిదర్శనమీ చిత్రం. గతేడాది ఆగస్టు 31న వచ్చిన భారీ సుడిగాలులకు ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం అటవీ ప్రాంతంలో లక్షల సంఖ్యలో భారీ వృక్షాలు కూకటి వేళ్లతో సహా నేలకొరిగిన విషయం తెలిసిందే. అయితే ప్రకృతి విధ్వంసానికి గురైన ఆ అటవీప్రాంతంలో తీసిన ఈ డ్రోన్ చిత్రంతో... ఇదిగో ఇలా ఓ వైపు పచ్చగా.. మరోవైపు నేలమట్టమైన లక్షలాది చెట్లతో కళావిహీనంగా కనిపిస్తోంది.

ఫొటో: 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ.

బాధితుల ప్రాణాలు.. మీ చేతుల్లో!

- గోల్డెన్ అవర్ గురించి తెలుసుకోండి..
- 'గుడ్ సమరిటన్' అందుకోండి..
- రోడ్డు ప్రమాద సమాచారం అందిస్తే ప్రోత్సాహకం
- గంటలోపు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి కాపాడగలిగితే రూ.5వేలు
- కేంద్ర ప్రభుత్వ కార్యక్రమంపై అవగాహన కరువు



వర్ధన్నపేట మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిని వ్యక్తి కోసం అంబులెన్సుకు ఫోన్ చేస్తున్న మాజీ ఎంపీ వినోద్ కుమార్(ఫైల్)



రోడ్డు ప్రమాదంలో గాయపడి వారిని అంబులెన్సులో ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు (ఫైల్)

వర్ధన్నపేట రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : గోల్డెన్ అవర్.. రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో క్షతగాత్రులను గంటలోపు ఆస్పత్రికి తరలిస్తే వారిని ప్రాణాపాయం నుంచి కాపాడే కీలక సమయం. సహజంగా ఏదైనా రోడ్డుప్రమాదం జరిగినప్పుడు అందరూ ఆందోళనకు గురవుతారు. పోలీసులకు, అంబులెన్సులకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్న ఆలోచన కూడా వచ్చే పరిస్థితి ఉండదు. కానీ ఆ పరిస్థితిని అధిగమించి.. కాస్తంత ధైర్యం చేసి.. గోల్డెన్ అవర్‌ను వినియోగించుకుంటే క్షతగాత్రులను ప్రాణాలను కాపాడిన వారవుతారు. అలా స్పందించే గుణాన్ని అలవాటు చేసేందుకు కేంద్రం ప్రభుత్వం ఓ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. గుడ్ సమరిటన్ పేరిట ఆపద సమయంలో స్పందించిన వారిని ప్రోత్సహించేందుకు ప్రశంసా ప్రతంతో పాటు రూ.5వేల నగదు ప్రోత్సాహం అందిస్తోంది. అయితే ఈ కార్యక్రమం గురించి సరైన అవగాహన లేదు. దాంతో ప్రమాదాల బారిన పడి తీవ్రగాయాలైన వారిని సకాలంలో ఆసుపత్రులకు చేర్చలేకపోతుండటంతో ప్రాణాలు కోల్పోతున్నారు. ఇలాంటి కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఆవశ్యకతను తెలియజేయాల్సి బాధ్యత అధికారుల పై ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

చట్టం ఉద్దేశం...

వాహన ప్రమాదాల్లో రహదారులపై కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. దాదాపు 50 శాతం రోడ్డు ప్రమాదాల్లో సకాలంలో వైద్యం అందకనే చనిపోతున్నట్లు జాతీయ స్థాయిలో అధికారులు చేసిన ఓ సర్వేలో వెల్లడైంది. ప్రమాదం జరిగిన తొలి గంటలోనే వైద్యం అందిస్తే ప్రాణాలు నిలపవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. కానీ పోలీసులు, కేసులు లాంటి అపోహలతో చాలా మంది చూసీచూడనట్లుగా వెళ్లిపోతున్నారని, పైగా రోడ్డు ప్రమాదాల తీరును, క్షతగాత్రులను ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పెట్టడానికి ఆసక్తి చూపుతున్నారన్నది వెల్లడైంది. ఇక ఈ గుడ్ సమరిటన్ చట్టం రోడ్డు ప్రమాద బాధితులను కాపాడటానికి, సహాయం చేసే వ్యక్తులకు రక్షణగా ఉంటుంది. సహాయానికి వచ్చిన వారిపై ఎలాంటి పోలీస్, న్యాయపరమైన చర్యలు ఉండవు. వారికి పోలీసులు, చట్టం రక్షణగా నిలుస్తుంది. సహాయం చేసిన వ్యక్తి సమాచారం, పూర్తి వివరాలు వెల్లడించే విషయంలో అధికారుల బలవంతమేమీ ఉండదు. రోడ్డు ప్రమాద బాధితులను గంటలోపు ఆస్పత్రికి తీసుకెళ్లి కాపాడితే రూ.5వేల నగదును ప్రోత్సాహకంగా అందిస్తారు. దేశ వ్యాప్తంగా పది ఉత్తమ గుడ్ సమరిటన్లకు రూ.లక్ష, సర్టిఫికెట్, ట్రోఫీ అందజేస్తారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి...

క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తే రూ.5వేల గుడ్ సమరిటన్ ప్రోత్సాహం అందుతుంది. ఈ ప్రోత్సాహం పొందాలంటే గంటలోపు బాధితుడిని ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారమివ్వాలి. దీంతో పోలీసులు గుర్తించి వారిని ప్రాణదాత (గుడ్ సమరిటన్) అంటూ ప్రమాద వివరాలతో కూడిన సర్టిఫికెట్‌ను అందిస్తారు. పోలీసులు జిల్లా కమిటీ ఈ రివార్డు సొమ్ము ఇవ్వాలని రోడ్డు రవాణా శాఖ అధికారులకు పంపిస్తారు. ఇది ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. అక్కడి నుంచి నగదు గుడ్ సమరిటన్ బ్యాంకు ఖాతాలో జమవుతుంది. ప్రశంసా పత్రం సైతం ఇస్తారు. ఒక వ్యక్తి గరిష్ఠంగా ఏడాదిలో ఐదుసార్లు ఈ అవార్డును పొందవచ్చు. కాపాడిన వ్యక్తి తన వ్యక్తిగత వివరాలేవీ చెపాల్సిన అవసరం, డబ్బులు ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. ఆస్పత్రిలో చేర్పించి వెళ్లిపోవచ్చు. అయితే జాతీయ, రాష్ట్ర రహదారులపై జరిగిన ప్రమాద బాధితులను చేర్పిస్తే ఈ పథకం వర్తిస్తుంది.

పోలీసుల నుంచి ఎలాంటి వేధింపులు ఉండవు



రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు బాధితులను గంటలోపు ఆస్పత్రికి తరలించి గుడ్ సమరిటన్‌గా పేరు తెచ్చుకోవాలి. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం గుడ్ సమరిటన్‌గా నిలిచిన వారికి రూ.5వేల ప్రోత్సాహం అందేలా చూస్తాం. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడంతో పాటు వారికి ఎలాంటి వేధింపులు ఉండవు. ప్రాణాలు కాపాడడం సాటి పౌరుడిగా మన బాధ్యత అనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. ప్రమాదం జరిగిన వెంటనే ఆస్పత్రికి తరలించడం లేదా పోలీసులకు, అంబులెన్సుకు సమాచారం అందించి అండగా నిలవాలి.

- శ్రీనివాసరావు, సీఐ వర్ధన్నపేట

అవగాహన లేకే గాల్లో కలుస్తున్న ప్రాణాలు...

రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఒక పౌరుడిగా సహాయం చేయాలనే అవగాహన లేకపోవడంతో క్షతగాత్రుల ప్రాణాలు ఆస్పత్రికి పోయే లోపే గాల్లో కలుస్తున్నాయి. సమాచారం పేరిట పోలీసుల వేధింపులు, కోర్టు కేసులు, సాక్షులుగా పెట్టి పంపిస్తారనే అపనమ్మకంతో కనీసం అంబులెన్స్‌కు సైతం సమాచారమిచ్చేందుకు సగటు వ్యక్తి వెనకాడుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకునే కేంద్ర ప్రభుత్వం గుడ్ సమరిటన్ అనే విధానాన్ని తీసుకువచ్చింది. కానీ, దీనిపై కూడా అవగాహన లేకపోవడంతో ప్రమాదాలను చిత్రీకరించడానికే తప్ప, సహాయం చేయాలనే ఆలోచన రావడంలేదు. దీంతో ఇటు పోలీసులు, అటు రోడ్డు రవాణా శాఖ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాలతో పాటు కొన్ని పట్టణాలు, నగరాల్లోని ప్రజలకు గుడ్ సమరిటన్ అంటే ఏంటో తెలియకుండా పోయింది. నేషనల్ హైవే అధికారులు కూడా ముందుకు వచ్చి జాతీయ రహదారిపై ఏర్పాటు చేసే సూచిక బోర్డులతో పాటు గుడ్ సమరిటన్ కర్తవ్యం గురించి వివరిస్తూ బోర్డులు పెట్టాలని పౌరులు కోరుతున్నారు.

నేడు ఇంజనీరింగ్ విద్యార్థులకు సదస్సు

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ మహిళ ఇంజనీరింగ్ కళాశాల నేతృత్వంలో కేయూ సెనెట్ హాల్‌లో శనివారం ఉదయం 10గంటలకు వీడియో ఎస్ కోడింగ్ యూజింగ్ ఎంఎల్ అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భిక్షాలు తెలిపారు. ఈ సదస్సుకు కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ బీకేఎస్ శ్రీనివాస్‌లు హాజరై మాట్లాడుతారని తెలిపారు.

19న జరిగే బీపీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షల వాయిదా

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఈనెల 19న జరగాల్సిన బీపీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షను కానిస్టేబుల్, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాతో పాటు ఇతర పోటీ పరీక్షల దృష్ట్యా వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ శుక్రవారం వెల్లడించారు. విద్యార్థులు గమనించాలని కోరారు. ఇతర వివరాలకు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

'ప్రభుత్వం రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలి'

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : వివిధ ప్రభుత్వ శాఖల్లో 2024 మార్చి నుంచి పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమాలకు శ్రీకారం చుడుతామని గిరిజన సామాజిక చైతన్య వేదిక అధ్యక్షుడు, రిటైర్డ్ హెచ్‌ఎం గుగులోతు కిషన్‌నాయక్, రిటైర్డ్ సీఐ అంబటి రవీందర్ హెచ్చరించారు. మహబూబాబాద్ పట్టణంలో శుక్రవారం పదవీవిరమణ పొంది బెనిఫిట్స్ రాని పెన్షనర్స్‌తో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 35 నుంచి 45 ఏళ్ల పాటు వివిధ ప్రభుత్వ శాఖల్లో వివిధ హోదాల్లో పనిచేసి, పదవీ విరమణ పొంది సంవత్సరం కావస్తున్నా నేటికి రావల్సిన బెనిఫిట్స్ రాక ఆర్థిక, ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కమ్యూటేషన్, జీపీఎఫ్, గ్రాడ్యూటీ, జీఐఎస్, మెడికల్ బిల్లు, సరెండర్ లీవ్స్‌తోపాటు ఇతరత్రా బెనిఫిట్స్ ప్రభుత్వం నుంచి రాలేదని చెప్పారు. బెనిఫిట్స్ కోసం తామంతా ఎదురు చూస్తున్నామని ప్రభుత్వం చొరవ చూపి తమకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. ఈ నెల 16న ఉదయం 11 గంటలకు మానుకోట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రాని పెన్షనర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామని, వారంతా సకాలంలో సమావేశానికి హాజరు కావాలని కోరారు. అందులో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని స్పష్టం చేశారు.

పంటల సర్వేను పరిశీలించిన ఏడీఏ


చిన్నముప్పారంలో పంట సర్వేను పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీనివాసరావు

ఇనుగుర్తి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : చిన్నముప్పారంలో నిర్వహిస్తున్న డిజిటల్ పంటల సర్వేను శుక్రవారం ఏడీఏ అజ్మీరా శ్రీనివాసరావు పరిశీలించారు. గ్రామంలోని 2 వేల ఎకరాల్లో ప్రతీ రైతు క్షేత్రానికి వెళ్లి ఆన్‌లైన్‌లో పంట వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట సాంకేతిక ఏవో రాజు, ఎంఏవో భూక్య మహేందర్, ఏఈవో ముజాహిద్ పాల్గొన్నారు.

సేవాలాల్ చూపిన సన్మార్గంలో నడవాలి


సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు

గూడూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మిక గురువు శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన సన్మార్గంలో యువత నడవాలని తహసీల్దార్ శ్వేత అన్నారు. గూడూరులో ఎస్టీవీఎస్, టీబీఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీసంత్‌సేవాలాల్ 286వ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. బంజరాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ అన్నారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ రామన్ననాయక్, టీబీఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ రామన్ననాయక్, ఎంపీడీవో వీరస్వామి, ఎస్సై గిరిధర్‌రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రాగం పరుశురాములు, అరవింద విద్యాసంస్థల కరస్పాండెంట్ పింగిలి శ్రీనివాస్, ఆర్ఐ మల్లయ్య, మాజీ ఎంపీపీలు నూనావత్ రమేష్‌నాయక్, చెల్పూరి వెంకన్న, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వాంకుడోతు కొమ్మాలు, మండల వర్కింగ్ శ్రీపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల వర్కిగ్ ప్రెసిడెంట్ సంపత్‌రావు, కటార్‌సింగ్, భాస్కర్‌నాయక్, అజ్మీర సురేష్, బోడ శరత్, సర్దార్‌బాబు, వెంకన్న, మోతీలాల్, మంగీలాల్, కిషన్ పాల్గొన్నారు.


చింతలగట్టు జాతరకు తరలివస్తున్న భక్తజనం


సమ్మక్క, సారలమ్మ దర్శనం కోసం క్యూలో నిల్చున్న భక్తులు


వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

పండు వెన్నెల.. నిండు జాతర

- చింతల గట్టులో సమ్మక్క సారలమ్మకు మొక్కులు
- భక్తులతో కిటకిటలాడిన తల్లుల గద్దెల ప్రాంగణాలు
- మూడోరోజూ కొనసాగిన రద్దీ

గూడూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : చింతలగట్టు.. వట్టివాగు సమ్మక్క, సారలమ్మ జాతరలో మూడోరోజు శుక్రవారం వైభవోపేతంగా సాగింది. ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి సైతం భక్తులు తరలివచ్చారు. వనదేవతలైన సమ్మక్క-సారలమ్మలకు భక్తులు తనివితీరా మొక్కులు చెల్లించుకున్నారు. నిలువెత్తు బంగారం, కోడి, యాటలను సమర్పించారు. తమను చల్లాగా చూడాలని అమ్మవార్లను వేడుకున్నారు. కాగా, రెండేళ్లకోసారి జరిగే మహా జాతరకు తీసిపోని విధంగా.. ఇప్పుడూ మినీ జాతర సాగుతోంది. బుధ, గురు, శుక్రవారాలు మూడు రోజుల్లో సుమారు లక్షా 20 వేల మంది భక్తులు వన దేవతలను దర్శించుకున్నట్లు జాతర నిర్వాహకులు తెలిపారు. భక్తులకు తాగునీరు, దర్శనం లాంటి వాటిల్లో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకున్నారు. ట్రాఫిక్ నియంత్రణ పోలీసులు పకడ్బందీగా నిర్వహించారు. సమ్మక్క-సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు, జంపన్న, నాగులమ్మలను దర్శించుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. బంగారం (బెల్లం), చీరె, సారె, ఒడిబియ్యం, పండ్లు సమర్పించుకున్నారు. నలుదిశలు పిక్కటిల్లేలా జయజయ ధ్వనాలతో చింతలగట్టు మేడారం దద్దరిల్లింది. మొక్కులు చెల్లించుకునే సమయంలో ఉద్వేగవాతావరణం నెలకొంది. అశేష జనవాణి వన దేవతలనుదర్శించుకున్నారు. కానుకలు, మొక్కులు సమర్పించుకున్నారు. తలనీలాలు, తులభారాలు జరిపించారు. కట్టలు తెచ్చుకున్న భక్తితో ఉరకలెత్తుతున్న భక్తజనంతో చింతలగట్టు.. వట్టివాగు సమ్మక్క-సారలమ్మ జాతర పరిసరాలు కిటకిటలాడాయి. రోజంతా భక్తుల సందడితో కోలాహలంగా మారింది. దర్శనానికి వచ్చిన భక్తులతో గద్దెల ప్రాంగణాలు సంద్రంగా మారాయి. ఈ కార్యక్రమంలో పూజారుల కమిటీ అధ్యక్షుడు దారం సిద్ధు, జాతర కమిటీ అధ్యక్షుడు పెనక నాగయ్య, జాతర నిర్వాహకులు, పూజారులు కారం లక్ష్మయ్య, ఈసం సహదేవులు, సనుప వీరస్వామి, వాసం భద్రయ్య, నరేష్, సుధాకర్, రమేష్, జనార్దన్, పోతయ్య, వజ్జయ్య, సాంబరాజు, అశోక్, భద్రయ్య, బుచ్చమ్మ పాల్గొన్నారు. కాగా, జాతర పరిసర అటవీప్రాంతంలో అగ్నిప్రమాదాలు చోటు చేసుకోకుండా అటవీశాఖ సిబ్బంది గస్తీకాసి, నివారిస్తున్నారు.

కులవ్యవస్థ క్యాన్సర్ కంటే ప్రమాదకరం

- గిరిజన సామాజిక చైతన్య వేదిక అధ్యక్షుడు కిషన్‌నాయక్

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సమాజంలో రోజురోజుకు కుల వ్యవస్థ వెళ్లూనుకుపోతుందని, అది క్యాన్సర్ వ్యాధి కంటే అతి ప్రమాదకరమని గిరిజన సామాజిక చైతన్య వేదిక అధ్యక్షుడు గుగులోతు కిషన్‌నాయక్ అన్నారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో శుక్రవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో కులమతాంతర వివాహితుల ఆత్మీయ అభినందన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన కిషన్‌నాయక్ మాట్లాడుతూ కుల, మతాంతర వివాహాలను ప్రోత్సాహించి మనుషులంతా ఒక్కటేనన్న భావనను కల్పించాలన్నారు. కులాంతర వివాహితుల కోసం ప్రత్యేకంగా రక్షణ చట్టం తీసుకురావాలన్నారు. అనంతరం కుల, మతాంతర వివాహం చేసుకున్న దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సాదుల శ్రీనివాస్, దుడ్డెల రాంమూర్తి, మందుల మహేందర్, చీపిరి యాకయ్య, యాకోబు, ప్రశాంత్, సురేష్, ఎల్ల య్య, నాగరాజు, గణేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


ఆత్మీయ అభినందన సభలో మాట్లాడుతున్న గుగులోతు కిషన్‌నాయక్


మానుకోటలో తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్

రియల్టర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

- తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : నిత్యం రియల్ ఎస్టేట్ ఏజెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ 2025 సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తెల్లరేషన్ కార్డు ఉన్న వారికి ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రియల్ ఎస్టేట్ ఏజెంట్లు సమిష్టిగా ఉంటూ సమస్యలను పరిష్కరించుకునే దిశగా ముందుకు సాగాలని సూచించారు. త్వరలోనే సంఘ సభ్యులందరికి గుర్తింపు కార్డులను అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రాయల కృష్ణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి దేశగాని కృష్ణ, తీగల దుర్గేష్, గుంటి శ్రీనివాస్, దాచేపల్లి సుధాకర్, ఎమ్డీ.నాజర్ ఉమాదేవి, కాలేరు మురళీ, నవీన్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

గంజాయి తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు

చెన్నారావుపేట (వరంగల్ జిల్లా), ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనంపై గంజాయి తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేష్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం మహబుబాబాద్ జిల్లాకు చెందిన బండి శ్రవణ్‌కుమార్, రాకేష్ అనే ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై రెండు బ్యాగుల్లోనాలుగు కిలోల గంజాయిని వరంగల్‌కు అక్రమంగా తరలిస్తుండగా, మండలంలోని లింగగిరి క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానంతో బ్యాగుల్లో తనిఖీ చేయగా నాలుగు కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు ద్విచక్ర వాహనంతో పాటు గంజాయిని స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

'రోడ్డు పనులు పూర్తి చేయాలి'

మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ నెహ్రూసెంటర్ నుంచి పత్తిపాక, మంగలి కాలనీ వరకు రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సాయిబాబా వీధి ప్రజలు వెంకటేష్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, క్రిష్ణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెహ్రూసెంటర్ నుంచి పత్తిపాక రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించి సంవత్సరాలు గడుస్తున్నపటికి అది నేటికి పూర్తికాక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు పనులు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరారు.

శతాధిక వృద్ధులు మృతి

సీరోలు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శుక్రవారం ఇద్దరు శతాధిక వృద్ధులు మృతి చెందారు. కాంపల్లి గ్రామానికి చెందిన నైజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన శతాధిక వృద్ధుడు గోల్కొండ భద్రయ్య (104) మృతి చెందారు. కొంతకాలంగా అస్వస్థతకు గురైన ఆయన కాంపల్లిలోని స్వగృహంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

- సీరోలు మండలంలోని ఉప్పరగూడెంకు చెందిన శతాధిక వృద్ధుడు మండలోజు నరహరి (107) మృతిచెందారు. గత కొన్ని రోజులుగా అస్వస్థతకు గురైన నరహరి శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. మృతుడికి కుమార్తె ఉన్నారు.

సేవాలాల్ జయంతిని ప్రభుత్వం జరపాలి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ మూడ్ శివాజీచౌహాన్ నాయక్

గార్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా జరపాలని మాజీ ఎంపీపీ మూడ్ శివాజీచౌహాన్ నాయక్ డిమాండ్ చేశారు. బంజారుల అరాధ్యదైవంగా భావించే సేవాలాల్ జయంతిని ప్రభుత్వం సేలవు దినంగా ప్రకటించి, అధికార లాంచనాలతో కన్నుల పండువగ నిర్వహించాలన్నారు. గ్యార్‌బాయ్ మత్రో నాయకులు మాలోత్ శివనాయక్, రావూజీ నాయక్, హరినాయక్, అశోక్‌నాయక్, జి.సక్రు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పరస్పరం దాడులు

- ముగ్గురికి గాయాలు


పరస్పర దాడులతో గాయపడిన వైరి వర్గాలు

మరిపెడ, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి) : వైరి వర్గాలు పరస్పరం దాడులకు పాల్పడగా, ముగ్గురికి గాయాలైన ఘటన మరిపెడ మునిసిపల్ కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధిత కుటుంబాలు తెలిపిన వివరాల ప్రకారం. బాబోజిగూడెం గ్రామానికి చెందిన దిగిజర్ల వీరన్న, బీమనబోయిన ఈశ్వర్ 10 రోజుల క్రితం అదే ఊరిలోని దశదిన కర్మకు వెళ్లి ఘర్షణ పడ్డారు. ఈ రెండు కుటుంబాల మధ్య ఈ వివాదం చిలికిచిలికి గాలివానగా మారి, శుక్రవారం బాబోజిగూడెంలో పరస్పర దాడులకు పాల్పడ్డారు. పోలీసులు ఇరువర్గాలను మరిపెడ పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చి, కౌన్సెలింగ్ చేశారు. వేర్వేరుగా బయటికి వెళ్లిన ఆ రెండువర్గాల వారు స్థానిక పెట్రోల్ బంక్ దగ్గర మళ్లీ పరస్పరం దాడులు చేసుకోగా, ఈ ఘటనలో నామాల సతీశ్, దిగిజర్ల సుధాకర్, బీమన బోయిన ఈశ్వర్ గాయపడ్డారు. వీరిని పోలీసులు చికిత్స కోసం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యమకారుల ఫోరం మండల ప్రధాన కార్యదర్శిగా రవి



కొత్తగూడ, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి) : ఉద్యమకారుల ఫోరం మండల ప్రధాన కార్యదర్శిగా కొత్తగూడకు చెందిన వజ్జ రవి ఎన్నికయ్యాడు. ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా కన్వీనర్ నందగిరి రజనీకాంత్ శుక్రవారం ప్రకటించారు. వజ్జ రవికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

తునికాకు టెండర్లు నిర్వహించాలి

కొత్తగూడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీ, గిరిజన, నిరుపేదలకు వేసవిలో ఉపాధి కల్పించే తునికాకు సేకరణ టెండర్లను వెంటనే నిర్వహించాలని సీపీఐ (ఎంఎల్) ఎన్డీ జిల్లా కార్యదర్శి గౌని అయిలయ్య డిమాండ్ చేశారు. కొత్తగూడలోని పాలడుగు కృష్ణ స్మారక భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డిమాండ్‌లతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా అయిలయ్య మాట్లాడుతూ తునికాకు ప్రూనింగ్ సీజన్ దాటిపోతున్న రాష్ట్రంలో టెండర్లను నిర్వహించకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఒరిస్సా, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్‌లో ఇప్పటికే టెండర్‌లు ఖరారయ్యాయని పేర్కొన్నారు. ఎన్డీ సబ్ డివిజన్ కార్యదర్శి ఇడంపాక శ్రీశైలం, నాయకులు యాదగిరి యుగేందర్, పసునూరి రాజమల్లు, తాటి రామయ్య, మద్దెల వెంకటేష్, ఈసం రామస్వామి, సారయ్య, మద్దెల విజయ, లక్ష్మీ పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ


కురవి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

కురవి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : కురవి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులే ఉపాధ్యాయులుగా పాఠశాలను నడిపించి ఆకట్టుకున్నారు. హెచ్‌ఎంగా పూజిత, డీఈవోగా తిరుమల్, ఆర్జేడీగా విజయ్‌ప్రసాద్ వ్యవహరించారు. ఉత్తమంగా బోధించిన విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా బహుమతులు అందించారు. శ్యాంకుమార్, ఉషశ్రీ, ఇందు, పూజిత, సాత్విక, అమూల్య, చాందిని మొదటి బహుమతులు గెలుచుకున్నారు. ద్వితీయ బహుమతులను వినయ్, సమీర, వైష్ణవి, స్వాతి, శ్రావణి, భవిత, అనూష గెలుపొందారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వహీద్, జడ్జిలుగా నర్సింహాచారి, పద్మలత, యాకమ్మ, ప్రోగ్రాం కన్వీనర్‌గా లక్ష్మయ్య, కో కన్వీనర్‌గా విజయలక్ష్మి పాల్గొన్నారు.

'మిర్చిని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలి'

కురవి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మిర్చిని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కురవి శివారులోని మిర్చి కల్లాలను సీపీఐ బృందం సందర్శించి రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిర్చి పంట పండించడానికి రైతాంగం ఎకరాకు రూ.లక్షన్నర పెట్టుబడి పెట్టారని, గతంలో ఎప్పుడు లేని విధంగా క్వింటా రూ.10, 12 వేల చొప్పున కొనుగోలు చేయడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. సీపీఐ మండల కార్యదర్శి కర్నం రాజన్న, బుర్ర సమ్మయ్య,కన్నె వెంకన్న, గజ్జి చంద్రయ్య, జిన్నె సూర్యనారాయణ, కందుల శరత్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి : ఎస్సై

కురవి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) :విద్యార్థులు మహిళల రక్షణ చట్టాలపై, షీటీమ్ విధుల గురించి అవగాహన పెంచుకోవాలని షీటీమ్ ఎస్సై సునంద అన్నారు. కురవి మండలం నేరడ మోడల్‌స్కూల్లో షీటీమ్‌పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆపద సమయంలో విద్యార్థులు డయల్ 100 లేదా సెల్ : 8712656935 నెంబర్లకు సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో మోడల్‌స్కూల్ ప్రిన్సిపల్ శ్రీకాంత్, షీటీమ్ సిబ్బంది అరుణ, రమేష్, భరోసా యూనిట్ రేణుక, బేబి, సుప్రజ పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై సునంద

పొదుపుతోనే ఆర్థికాభివృద్ధి

మరిపెడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : పొదుపుతోనే మహిళల ఆర్థికాభివృద్ధి జరిగి కుటుంబాలు బలోపేతం అవుతాయని మరిపెడ ఏపీఎం రాములు అన్నారు. శుక్రవారం మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని స్త్రీశక్తి భవన్‌లో డ్వాక్రా సంఘాల వీవో, వీవోఏల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. ఆరోగ్య సమస్యలపై అవగాహన కలిపించారు. ఈ కార్యక్రమంలో సీసీ రుక్మిణీ, జానీ తదితరులు పాల్గొన్నారు.

తునికాకు యూనిట్లకు టెండర్లు నిర్వహించాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

గూడూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : తునికాకు యూనిట్లకు టెండర్లు నిర్వహించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు మొగిలి ప్రతాపరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి కోడి సోమయ్యలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గూడూరులో ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 50 ఆకుల కట్టకు రూ. 6 చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు జోగ రణధీర్, ఉపేందర్, ఎస్‌కె.బాబు పాల్గొన్నారు.

ఇంటర్నల్ మార్కుల రికార్డుల పరిశీలన

మరిపెడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : టెన్త్ ఇంటర్నల్ మార్కుల కోసం విద్యార్థుల రికార్డులను మండల తనిఖీ బృందం శుక్రవారం తనిఖీ చేశారు. మరిపెడ హైస్కూల్ తోపాటు జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను, వారి రికార్డులను పరిశీలించారు. గెజిటెడ్ హెచ్‌ఎం అనంతరావు, సబ్జెక్టు ఉపాధ్యాయులు బయగాని రాంమోహన్, పవన్, ఎంఈవో అనితాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎండు గంజాయి పట్టివేత

పాలకుర్తి(జనగామ జిల్లా), ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి, వారి నుంచి 31కిలోల ఎండు గంజాయిని పాలకుర్తి పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఘటన వివరాలు సీఐ గట్ల మహేందర్‌రెడ్డి మీడియాకు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.

ముంబైలోని రాబెల్ ప్రాంతానికి అశిష్ రామ్‌నాయక్ యాదవ్, రాహుల్ రామ్ లఖన్ తివారి అదే ప్రాంతంలోని మోతీ టెక్ కంపనీలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. వచ్చే వేతనం జల్సాలకు సరిపోక పోవడంతో ఈజీ మనీ కోసం గంజాయి విక్రయించాలని ఇరువురు నిర్ధారించుకున్నారు. ఈ క్రమంలో వారితో కలిసి ఉద్యోగం చేసిన అన్ను గంజాయి సరఫరా చేస్తున్నాడని తెలుసుకొని ఒడిశాలోని భువనేశ్వర్‌లో కలిశారు. అన్నుతో మాట్లాడి ఆయన వద్ద రూ.1.80 లక్షలకు 31 కిలోల ఎండు గంజాయిని కొనుగోలు చేశారు. భువనేశ్వర్ నుంచి తిరిగి ముంబైకి రైలులో వెళ్తున్న క్రమంలో వరంగల్ రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు తనిఖీలు చేస్తుండగా భయంతోనిందితులు రైలుదిగి బస్టాండ్ వైపు వెళ్లారు. రైలులో గంజాయి తీసుకు వెళ్లడం సాధ్య పడదని భావించిన నిందితులు హైదరాబాద్‌కు వెళ్లే క్రమంలో వరంగల్‌లో బస్సు ఎక్కి పాలకుర్తికి చేరుకున్నారు. పోలీసులను గమనించిన నిందితులు పారిపోయేందుకు యత్నించగా అదుపులోకి తీసుకొన్నారు. వారి బ్యాగులు సోదా చేయగా మార్కెట్లో రూ.7.92 లక్షల విలువ చేసే 16 ప్యాకెట్ల ఎండు గంజాయి లభ్యమైంది. వారిని అరెస్టు చేయడంతో పాటు గంజాయి, మొబైల్ ఫోన్లు సీజ్ చేశారు.

'పరీక్షలకు సన్నద్ధం కావాలి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సన్నద్ధం కావాలని మోటివేషనల్ స్పీకర్ అరుణ్ అయ్యప్ప అన్నారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పీఎం శ్రీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విద్యార్థినులకు కెరీర్ గైడెన్స్, కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పాఠశాల స్థాయి నుంచే లక్ష్యాన్ని ఎంచుకొని దాన్ని సాధించేందుకు పట్టుదలతో చదువుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలన్నారు. పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించేలా, ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు. ఇన్చార్జీ హెచ్‌ఎం గిరిజ ఆధ్యక్షతన జరిగిన ఈ అవగాహన కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మావతి, సునిత, విజయ్‌కుమార్, కౌసల్య, రజియా, వీణ, రంజాన్, అలీ, సంజీవ, శ్రీవాణి, రమాదేవి మంజులరాణి, సుచిత్ర, నవీన, పద్మ, జ్యోత్స్న, రమేష్ పాల్గొన్నారు.


విద్యార్థినులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పిస్తున్న వరుణ్‌అయ్యప్ప